



'ముద్దచర్మం' పరిశీలనకు నిపుణుల బృందం

◆ నేడు పలు ప్రాంతాల్లో పర్యటనలు
◆ ప్రతి గ్రామంలో జబ్బుబారిన 5 నుంచి 25 పశువులు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఉమ్మడి అనంతపురం జిల్లాలో మూగజీవలను 'ముద్ద చర్మం' (లంపీ స్కిన్) జబ్బు మింగేస్తోంది. ప్రతి గ్రామంలోనూ ఈ వ్యాధి బారినపడిన పశువులు పడ్డాయి. ఇంత పెద్దఎత్తున పశువుల్లో ఈ రకమైన జబ్బు వ్యాపించడం ఇటీవలి కాలంలో ఇదే ప్రథమం. కరువుకు నిలయమైన అనంతపురం జిల్లాలో వ్యవసాయ అనుబంధ పరిశ్రమగా పశుపోషణ ప్రధానంగా ఉంది. పాడి అధికంగానే ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఉంది. వ్యవసాయంలో వస్తున్న నష్టాల నుంచి గట్టెక్కిస్తున్నది పశుపోషణే. ఇప్పుడు దీనికి ముద్ద చర్మం మూలంగా పెద్ద నష్టం వాటిల్లుతోంది. దీని నివారణ కూడా ఏ రకంగా అన్నది అంతుచిక్కకుండా ఉండటం ఆందోళన కలిగిస్తున్న అంశం.

నేడు నిపుణుల బృందం జిల్లాకు రాక

ముద్దచర్మం వ్యాధిని పరిశీలించే నిమిత్తం ప్రభుత్వం శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయ నుంచి శాస్త్రవేత్తల బృందాన్ని జిల్లాకు పంపుతోంది. ఈ బృందం బుధవారం నాడు ఉమ్మడి అనంతపురం జిల్లాలో పర్యటించనుంది. బుక్కరాయసముద్రం మండలంలోని కేంద్రీయ ఆరుబయలు కారాగారం, పెద్దపప్పూరులోనూ పర్యటించి పరిస్థితిని అంచనా వేయనున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఇప్పుడు ఈ జబ్బు భారిన పశువులు పడుతున్నాయి. ఇందులో చాలా వరకు చనిపోతున్నాయి. వైరస్ ద్వారా వ్యాప్తి చెందుతున్న ఈ జబ్బు నివారణ కూడా కష్ట సాధ్యంగానే మారుతుండటంతో ఏమి చేయాలన్నది పశు వైద్యులకు సైతం అంతుబట్టడం లేదు. కేంద్ర ప్రభుత్వం సూచించిన ప్రకారం 'గోట్ ఫాక్స్' వ్యాక్సిన్‌ను ఈ పశువులకు ఇస్తున్నా పెద్దగా ఫలితం ఉండటం లేదు. కొత్తగా వచ్చిన ఈ వైరస్‌ను నిలువరించడం కష్టసాధ్యమే అవుతోంది. దీని నివారణపై దృష్టి సారించడంలో భాగంగా నేడు నిపుణుల బృందం జిల్లాకు రానుంది.

ప్రతి గ్రామంలోనూ వ్యాధిబారినపడ్డ పశువులు

అధికారుల అంచనా ప్రకారం ప్రతి గ్రామంలోనూ 5 నుంచి 25 పశువులు దీని బారినపడినట్టుగా గుర్తించారు. అనంతపురం జిల్లాలోనే 2.1 లక్షల పశు వులున్నాయి. వీటిల్లో అత్యధికం దీని బారినపడ్డాయి. ఇప్పటి వరకు అధికారికంగా నమోదయిన కేసుల వరకు చూస్తే 57 కేసులు అనంతపురం జిల్లాలో నమోదవగా 13 చనిపోయినట్టు రికార్డు అయ్యాయి. ఇక సత్యసాయి జిల్లాలో 25 కేసులు నమోదయ్యాయి. ఇందులో 15 మృత్యువాతపడ్డాయి. ఈ రకంగా ఈ వ్యాధి బారినపడి అత్యధికంగా ఇబ్బంద పడుతున్న రకం చూస్తే ఒంగోలు జాతి రకం పశువుల్లో జబ్బు తీవ్రత అధికంగా ఉన్నట్టు తెలుస్తోంది. ఈ జబ్బుకు ఇప్పటికి నిర్ధిష్టమైన మందుల్లేవీ లేనట్టు తెలుస్తోంది. నివారణకు ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాల్సి వస్తుందన్నది నిపుణుల పరిశీలించాక ఏదైనా సలహాలు, సూచనలిస్తారా అన్నది చూడాల్సి ఉంది.



సదస్సు నుంచి ప్రజలకు అభివాదం చేస్తున్న సిపిఎం రాయలసీమ ప్రాంత నాయకులు

పాలకుల నిర్లక్ష్యంతోనే సీమ వెనుకబాటు

◆ విభజన హామీలు అమలు చేయకుండా బిజెపి మోసం
◆ సిఎం జగన్ మోడీకి మోకరిల్లడం సిగ్గుచేటు ◆ సాగునీటి ప్రాజెక్టులన్నింటినీ వెంటనే పూర్తి చేయాలి
◆ పరిశ్రమలు ఏర్పాటు చేసి యువతకు ఉపాధి చూపాలి ◆ రాయలసీమ సదస్సులో సిపిఎం నేతలు

ప్రజాశక్తి-గుంతకల్లు

దశాబ్దాల పాటు పాలకుల నిర్లక్ష్యం వల్లనే రాయలసీమ అన్ని విధాలా వెనుకబాటుకు గురైందని సిపిఎం రాయలసీమ నేతలు పేర్కొన్నారు. "రాయలసీమ సమగ్రాభివద్ధి అవకాశాలు-ఆటంకాలు-పరిష్కారాలు" అనే అంశాలపై మంగళవారం నాడు సిపిఎం ఆధ్వర్యంలో గుంతకల్లు పట్టణంలోని రాయల్ ఫంక్షన్ హాలులో సదస్సు నిర్వహించారు. సిపిఎం గుంతకల్లు పట్టణ కార్యదర్శి బి.శ్రీనివాసులు అధ్యక్షతన నిర్వహించిన సదస్సులో రాయలసీమ జిల్లాలకు చెందిన సిపిఎం జిల్లా కార్యదర్శులు, పార్టీ కార్యవర్గం సభ్యులు పాల్గొన్నారు. సదస్సుకు ముఖ్య వక్తగా హాజరైన కె.ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ రాయలకాలంలో రతనాల సీమగా ఉన్న రాయలసీమ పాలకుల నిర్లక్ష్యం కారణంగా రాళ్ల సీమగా మారిందని అన్నారు. విభజన హామీలను అమలు చేయకుండా సీమకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అన్ని విధాలా మోసం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీమకు అన్యాయం చేసిన ప్రధాని మోడీ వద్ద ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి మోకరిల్లడం సిగ్గుచేటన్నారు. వర్షాభావం, సాగునీరు లేక రాయలసీమ జిల్లాల్లో వ్యవసాయం కుంటుబడిందన్నారు. సీమ వ్యాప్తంగా 25 లక్షల ఎకరాల్లో రైతులు పంటలు సాగు చేయలేదని తెలిపారు. పంటలకు గిట్టుబాటు ధరల లేక అన్నదాతలు అప్పులఊబిలో చిక్కుకుని చివరకు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పాలకుల నిర్లక్ష్యం కారణంగా రాయలసీమ జిల్లాల్లో కొత్త పరిశ్రమలు రాకపోగా ఉన్న పరిశ్రమలు మూతపడ్డాయన్నారు. నాడు కాంగ్రెస్ పార్టీ నుంచి నేటి వైసిపి వరకు ఎక్కువ శాతం మంది రాయలసీమ ప్రాంత సిఎంలు పాలన చేసిన సీమ అభివృద్ధికి ఒనగూరిన లాభం ఏమీ లేదన్నారు. నీటి ప్రాజెక్టులపైనా పాలకులకు చిత్తశుద్ధి లేకపోవడంతో తుంగభద్ర నీరు సక్రమంగా రావడం లేదన్నారు. హంద్రీనీవా, గాలేరు నగరి, తెలుగుగంగ ప్రాజెక్టుల నీరు వస్తేనే సీమ అభివద్ధి సాధ్యం అవుతుందన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, రాయలసీమకు ప్రత్యేక ప్యాకేజీ, విభజన హామీలు ఇవ్వకుండా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పూర్తిగా మోసం చేసిందని మండపడ్డారు. కడపస్టీల్ ప్లాంట్ పరిశ్రమ శంకుస్థాపనకే పరిమితం అయిందన్నారు. సీమజిల్లాల్లో అపారమైన ఖనిజ సంపద ఉన్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వివక్ష వల్ల పరిశ్రమలు ఏర్పాటు కాలేదన్నారు. సమైఖ్య పోరాటాలుతోనే రాయలసీమ సమగ్రాభివద్ధి సాధ్యం కాగలదని అందుకు ఈ సదస్సు వేదికగా నిలుస్తుందని తెలియజేశారు.

అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లా కార్యదర్శులు వి.రాంభూపాల్, ఎం.ఇంతియాజ్‌లు మాట్లాడుతూ రాయలసీమ అభివద్ధికి శ్రీబాగ్ ఒడంబడిక ఒప్పందం జరిగి 85 ఏళ్లు గడిచినా పాలకుల నిర్లక్ష్యం కారణంగా కరువు సీమగానే మిగిలి పోయిందన్నారు. ధైర్యంగా రైతులు పంటలు సాగు చేయడానికి నీరు, గిట్టుబాటు ధరలు ఉండాలన్నారు. యువతకు ఉపాధి కోసం పరిశ్రమలు నెలకొల్పాలన్నారు. విద్య, వైద్యం నుంచి సామాజిక జీవనం వరకు అభివద్ధి జరిగినపుడే సమగ్రాభివద్ధి సాధ్యం అవుతుందన్నారు. పాలకులకు చిత్తశుద్ధి ఉంటే పదేళ్లలో రాయలసీమ అభివద్ధి సాధ్యం అవుతుందన్నారు. ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది వర్షాలు వచ్చాయని, దీంతో ప్రాజెక్టులు పూర్తిగా నిండాయన్నారు. అయినా ఆ నీటిని నిల్వ చేసుకోలేక 42 టిఎంసిల నీరు వథాగా సముద్రం పాలయ్యాయని తెలిపారు. నీటి నిల్వ సామర్థ్యం మేరకు ప్రాజెక్టుల నిర్మాణాలు జరిగిఉంటే నీరు వృథా అయ్యేది కాదన్నారు. పాలకుల కుట్రల వల్లే రాయలసీమకు పరిశ్రమలు రాకుండా, యువతకు ఉపాధి దూరం అయ్యిందని దుయ్యబట్టారు. రాయలసీమ అభివద్ధి కోసం ప్రశ్నించేందుకు పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థిగా నాగరాజును నిలిపామని, పట్టభద్రులు అందరూ ఈయన గెలుపునకు కృషి చేసి సీమ అభివృద్ధికి సహకారం అందించాలని కోరారు. కర్నూలు జిల్లా ప్రధాన కార్యదర్శి గౌస్‌దేశాయ్ మాట్లాడుతూ కర్నూలు, అనంతపురం జిల్లాల్లో సకాలంలో సాగునీరు అందక ఉల్లి పంటలు ఎండిపోయి రైతులు కన్నీరు పెడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. కడపలో స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేసుకోలేని ఆ ప్రాంత అసమర్థ సీఎంగా జగన్‌రెడ్డి చరిత్రలో నిలిచిపోతారని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో నంద్యాల, కడప, తిరుపతి జిల్లా కార్యదర్శిలు నాగేశ్వరరావు, రామ్మోహన్‌రెడ్డి, బి.నాగరాజు, పీడీఎఫ్ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజు, కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఓ.నల్లప్ప, సిపిఎం అనంతపురం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బాలరంగయ్య, డి.శ్రీనివాసులు, గుంతకల్లు పట్టణ కమిటీ కార్యదర్శివర్గ సభ్యులు దాసరి శ్రీనివాసులు, కసాపురం రమేష్, సాకే నాగరాజు, మారుతి ప్రసాద్, జగ్గలి రమేష్, రాము రాయల్, శ్రీశంకరానందగిరిస్వామి కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ డా॥రామకష్ణ నాయుడు, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు సి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

శిశు మరణాలను పూర్తిస్థాయిలో నియంత్రించాలి

పుట్టపర్తి రూరల్ : జిల్లాలో శిశు మరణాలు పూర్తిస్థాయిలో నియంత్రించేందుకు చర్యలు తీసుకోవాలని డిఎం అండ్ హెచ్ఒ ఎస్వీ కృష్ణారెడ్డి అధికారులకు సూచించారు. నెలవారి సమీక్ష లో భాగంగా శిశు మరణాల పై అధికారులతో ఆయన మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి వైద్య ఆరోగ్యశాఖ,శిశు సంక్షేమ శాఖ అధికారులు, అంగన్వాడీలు ,ఆశాలు, పాల్గొన్నారు. గత నెలలో శ్రీ సత్యసాయి జిల్లాలో ఏడు శిశు మరణాలు నమోదయ్యాయన్నారు. క్షేత్రస్థాయిలో వైద్య ఆరోగ్యశాఖ అధికారులు పరిశీలించి భవిష్యత్తులో ఇలాంటి పరిణామాలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో డిసిహెచ్ఎస్ తిప్పేంద్ర నాయక్, ధర్మవరం ఏరియా ఆసుపత్రి గైనకాలజిస్ట్ చంద్రకళ, పీడియాట్రిక్ వెంకటేశ్వర్లు, ఐసిడిఎస్ నోడల్ అధికారి గాయత్రి, సిడిపిఒలు పెనుగొండ శాంతలక్ష్మి, ధర్మవరం వైలక్ష్మి, లక్ష్మీ బాయి పాల్గొన్నారు.

శ్రీసత్యసాయి కార్మికుల సమ్మె విజయవంతం



సమస్యల పరిష్కారంపై అధికారుల నుంచి ఒప్పంద హామీ పత్రాన్ని తీసుకుంటున్న సత్యసాయి కార్మికులు

◆ కలెక్టర్ చొరవతో లిఖితపూర్వక హామీ
◆ కృతజ్ఞతలు తెలిపిన సిఐటియు రాష్ట్ర నాయకులు ఓబులు
◆ పనుల్లోకి వెళ్లిన కార్మికులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శ్రీసత్యసాయి తాగునీటి పథకం కార్మికులు సిఐటియు ఆధ్వర్యంలో చేపట్టిన సమ్మె విజయవంతం అయింది. 16 రోజుల రిలే దీక్షలు, 19 రోజుల పాటు సమ్మె ద్వారా చేసిన పోరాటాలు ఫలించాయి. కార్మికుల న్యాయమైన డిమాండ్‌లను పరిష్కరించేందుకు జిల్లా కలెక్టర్, తాగునీటి బోర్డ్ ఛైర్మన్ ఎస్.నాగలక్ష్మి ప్రత్యేక చొరవ చూపడంతో అగ్రిమెంట్ రూపంలో ఎప్పటిలోగా సమస్యలు పరిష్కరిస్తారన్న దానిని స్పష్టంగా పొందుపరిచారు. దీనికి కార్మికులు సమ్మతిస్తూ సమ్మెను మంగళవారం విరమించారు. అనంతపురం నగరంలోని హౌసింగ్ బోర్డ్‌కాలనీలో శ్రీసత్యసాయి తాగునీటి బోర్డ్ కార్యాలయంలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, సిఐటియు నాయకులు, శ్రీసత్యసాయి తాగునీటి పథకం కార్మికులతో మంగళవారం ఉదయం చర్చలు నిర్వహించారు. ఇందులో పలు అంశాలు, డిమాండ్లను కార్మికులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. 'మృతిచెందిన, ఉద్యోగవిరమణ, రాజీనామా చేసిన కార్మికులకు జనవరి 2023 లోగా, మిగిలిన కార్మికులందరికీ మార్చి 2023లోగా చెల్లించాలి. మార్చిలోగా చెల్లించకపోతే 1998 ఏప్రిల్ నుంచి సర్వీస్ కంటిన్యూ చేస్తూ ఎప్పుడు ఉద్యోగ విరమణ అయినా, మరణించినా, డ్యూటీ నుంచి వైదొలగిన కార్మికులకు గ్రాట్యూటీ చెల్లిస్తాం. ఎల్‌అండ్‌టి కంపెనీ వారు చెల్లిస్తున్న బోనస్, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ జూలై 2021 నుంచి యథాతథంగా కొనసాగించి చెల్లించాలి. వేతనాలు పెరకగ 11 సంవత్సరాల నుంచి పని చేస్తున్న 572 మంది కార్మికులందరికీ ఏప్రిల్ నుంచి పెంచి తక్షణమే అమలు చేయాలి. రెండు నెలల బకాయి వేతనాలు వారంలోగా చెల్లించాలి. ప్రతి నెలా 5వ తేదీలోగా వేతనాలు చెల్లింపులు జరగాలి. కార్మికులకు బోర్డు ద్వారా గుర్తింపు కార్డులు ఇవ్వాలి. ఉద్యోగవిరమణ, మరణించిన, అనారోగ్య కారణాల రిత్యా విధులు మానేసిన కార్మికుల కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలి. సమ్మె కాలాన్ని సెలవుతో కూడిన దినంగా ప్రకటించాలి. కార్మికుల పట్ల కక్ష సాధింపు చర్యలు ఉండకూడదు'. తదితర అంశాలపై బోర్డు అధికారులు, శ్రీసత్యసాయి తాగునీటి పథకం కార్మికుల యూనియన్ నాయకుల మధ్య చర్చలు జరిగాయి. ఈ డిమాండ్లు అన్నింటికీ సమ్మతిస్తూ అధికారులు అగ్రిమెంట్‌ను రాసుకున్నారు. దీంతో కార్మికులు సాయంత్రం 6 గంటలకు సమ్మెను విరమించి పనుల్లోకి వెళ్లారు.

అధికారులకు కృతజ్ఞతలు : ఓబులు

కార్మికుల సమస్యల పరిష్కారంపై స్పందించిన అధికారులకు సత్యసాయి కార్మికుల యూనియన్ గౌరవాధ్యక్షులు, సిఐటియు రాష్ట్ర నాయకులు జి.ఓబులు కృతజ్ఞతలు తెలిపారు. కార్మికుల పక్షాన కలెక్టర్ చూపిన చొరవకు ధన్యవాదాలు తెలిపారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఇ హసన్‌బాషా, డిఇఇ రామారావు, ఇతర అధికారులు కూడా సానుకూలంగా కార్మికుల వైపు ఆలోచించి పరిష్కారానికి అంగీరించి భరోసా ఇవ్వడం అభినందనీయం అన్నారు. సమ్మెకు మద్దతు ఇచ్చిన విద్యార్థి, రైతు, కార్మిక, ప్రజా సంఘాలు, వామపక్ష పార్టీలు, మేధావులు, ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్స్ సంఘాలు, కళాకారులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీసత్యసాయి తాగునీటి పథకం కార్మికుల యూనియన్ అధ్యక్షులు తిప్పేస్వామి, కార్యదర్శి శ్రీరాములు, మక్బుల్‌బాషా పాల్గొన్నారు.

ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి



పరిటాల శ్రీరామ్‌ను సన్మానిస్తున్న నాయకులు

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

ముస్లీం మైనార్టీల సమస్యలపై ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని టిడిపి ధర్మవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ సూచించారు. ఈ మేరకు మంగళవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ధర్మవరం నియోజకవర్గ కమిటీలో స్థానం పొందిన మైనారీనాయకులు పరిటాల శ్రీరామ్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా పరిటాల శ్రీరామ్ మాట్లాడుతూ పదవులు పొందిన ప్రతి ఒక్కరు మైనార్టీల సమస్యలపై ప్రభుత్వం వైఫల్యాలను ఎండగట్టాలన్నారు. టీడీపీ హయాంలో మైనార్టీలకు ఇచ్చేపథకాలను జగన్ ప్రభుత్వం రద్దు చేసిందని. వీటిని మైనార్టీనాయకులు ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు పఠానా బాబూఖాన్, రాళ్లపల్లి షరీప్, క్రిష్ణాపురం మైనార్టీ నాయకులు నాగూరు జమీరాబాషా, అత్తార్ రహీంబాషా, మాటు, బాబావలి కుళ్లాయప్ప, ఉస్మాన్, అన్వర్, ఇమాం తదితరులు పాల్గొన్నారు.

పంపిణీకి ఉచిత ట్రైస్కూటర్లు సిద్ధం

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

శ్రీ సత్య సాయి జిల్లాలో విభిన్న ప్రతిభావంతులకు ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేయడానికి ట్రై స్కూటర్లు ను సిద్ధం చేసింది. ఈ మేరకు వాటిని హైదరాబాదు నుండి నేరుగా పుట్టపర్తికి మంగళవారం సరఫరా చేశారు. ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా దాదాపు 500 మంది విభిన్న ప్రతిభావంతులు దరఖాస్తు చేసుకోగా, వందశాతం వికలత్వం గల అభ్యర్థులకు ప్రభుత్వం ఉచితంగా ట్రై స్కూటర్లను పంపిణీ చేయనుంది. ఇందులో భాగంగా సత్యసాయి జిల్లాకు 60 స్కూటర్లు మంజూరు కాగా, మంగళవారం జిల్లా కేంద్రానికి అవి చేరాయి. వాటిని ఆర్డీవో కార్యాలయం పక్కన ఉన్న గోడౌన్లో భద్రపరిచారు. వీటిని డిసెంబర్ 3న ప్రపంచ వికలాంగుల దినోత్సవ సందర్భంగా పంపిణీ చేయనున్నట్లు కౌన్సిలింగ్ ఫర్ బీ హ్యాపీడేషన్ మార్కెటింగ్ ఆఫీసర్ రామాంజనేయులు తెలిపారు.

అంగన్వాడీల్లో పురుగులు పట్టిన చిక్కీలు



పురుగుపట్టిన చిక్కీ

ప్రజాశక్తి కదిరి టౌన్

కదిరి తూర్పు ఐ సి డి ఎస్ ప్రాజెక్టు పరిధిలోని నల్లచెరువు మండలం దామవాండ్లపల్లిలో జగనన్న సంపూర్ణ పోషణలో పురుగులు పట్టిన చిక్కిలు పంపిణీ చేసిన ఘటన చోటు చేసుకుంది. మహిళలు, గర్భిణులు, పిల్లల్లో పౌష్టికాహార లోపం, అనారోగ్య సమస్యలు తలెత్తకూడదన్న ఉద్దేశంతో ప్రభుత్వాలు కోట్లు నిధులు వెచ్చించి అంగన్వాడీ సెంటర్ల ద్వారా శనగపప్పు చిక్కీలు, కోడిగుడ్లు, జొన్న పిండి, రాగి పిండి, తదితర పోషక పదార్థాలు నెలనెలా పంపిణీ చేస్తున్నాయి. పౌష్టికాహారం నెల నెలా సక్రమంగా సెంటర్లకు అందేలా పర్యవేక్షణ చేసే అధికారుల నిర్లక్ష్యంతో ప్రభుత్వ ఆశయాలకు తూట్లు పడుతున్నాయి. అంగన్వాడీలకు సంబంధిత కాంట్రాక్టర్ తీసుకొచ్చిన కోడిగుడ్లు పౌష్టికాహారాలు మొదటి ముద్రించిన తేది చివరి గడువు తేదీ నాణ్యతను సిడిపిఒ, ఇతర అధికారులు తనిఖీ చేసిన అనంతరం సరఫరా చేయాల్సుంటుంది. అయితే ఇందులో సిడిపిఒ, సూపర్వైజర్ల పర్యవేక్షణ లోపం స్పష్టంగా కనిపిస్తోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పురుగు పట్టిన చిక్కీలు, గడువు తీరిన పౌష్టికాహారాలు సెంటర్లకు పంపిణీ చేస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవటం లేదన్న విమర్శలు వినపడుతున్నాయి. అయితే ఈ విషయంలో అధికారులకు, కాంట్రాక్టరుకు లోపాయికారి ఒప్పందం ఉందా అన్న అనుమానాలు సైతం వెలువడుతున్నాయి. పురుగు పట్టిన చిక్కీలు సెంటర్లకు పంపిణీ చేయడంతో పిల్లలు, గర్భిణులు వీటిని తిన అనారోగ్యానికి గురైతే ఎవరు బాధ్యత వహిస్తారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత జిల్లా అధికారులు దృష్టి సారించి ఇలాంటివి పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. అంగన్వాడీ సెంటర్లకు పురుగు పట్టిన చిక్కీల పంపిణీ విషయంపై సూపర్వైజర్ స్పందించారు. పురుగు పట్టిన చిక్కీలను సంబంధిత కాంట్రాక్టర్‌కు వెనక్కి పంపించి నాణ్యమైన వాటిని సరఫరా చేయమని కోరుతామని చెప్పారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



కరపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే

గాండ్లపెంట : అర్హులందరికీ పక్కాగృహాలు మంజూరు చేస్తామరని ఎమ్మెల్యే డాక్టర్ పివి. సిద్ధారెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని సోమయాజులపల్లి దళితవాడ, వేపలకుంట, బులుగుట్లవారిపల్లి, ఎర్రజేనుపల్లి తదితర గ్రామాలలో మంగళవారం నిర్వహించిన గడపగడప మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన వారందరూ జగనన్న గృహాలకు దరఖాస్తు చేసుకోవాలని వెంటనే మంజూరు చేస్తామని చెప్పారు. ఇంటింటికి తిరిగి సంక్షేమ పథకాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులతో పాటు వైసీపీ మండల కన్వీనర్ పోరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, ఎంపీటీసీలు జి సోమశేఖర్ రెడ్డి, వైస్ ఎంపిపి గంగోజమ్మ. జిల్లా కోఆప్షన్ సభ్యుడు ఫయాజ్ అలీ, మాజీ జెడ్పీటీసీ భాస్కర్ రెడ్డితో పాటు సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సోమందేపల్లి : మండలం పరిధి మండ్లీ పంచాయతీ పరిధిలోనిఎస్సీ కాలనీ, కొల్లుకుంట, రూకులపల్లిలో మంగళవారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పెనుకొండ ఎమ్మెల్యే శంకర నారాయణ పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయా గ్రామాల ప్రజలు ఎమ్మెల్యేకు ఘనస్వాగతం పలికారు. ఈసందర్భంగా ఆయన ఇంటింటికి తిరిగి ప్రజాసంక్షేమ పథకాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ నారాయణరెడ్డి, ఎంపీపీ గంగమ్మ వెంకటరత్నం, జెడ్పీటీసీ అశోక్, స్థానిక సర్పంచి కెపి కిష్టప్ప, వైస్ ఎంపీపీ రత్నమ్మ నారాయణ, ఎంపీటీసీ పుష్ప రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామంలో పారిశుధ్య చర్యలు

'ప్రజాశక్తి' కథనానికి స్పందన



పారిశుధ్య చర్యలు నిర్వహిస్తున్న కార్మికులు

తనకల్లు : మండల కేంద్రంలోని తారకరామ నగర్‌లో పంచాయతీ అధికారులు పారిశుధ్య చర్యలు చేపట్టారు. పడకేసిన పారిశుధ్యం శీర్షికన ప్రజాశక్తి దినపత్రికలో మంగళవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. గ్రామపంచాయతీ కార్యదర్శి రామకృష్ణారెడ్డి, సర్పంచి భర్త రామకృష్ణ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులు వీధులను శుభ్రం చేశారు. అలాగే వీధుల్లో అడ్డదిడ్డంగా పెరిగిన కంపచెట్లను తొలగించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ వీధుల్లో దుస్తులు, ఉతకడం పాత్రలు కడగడం చేయకూడదని సూచించారు. పరిశుభ్రతకు ప్రజలు సహకరించాలని కోరారు.

రైతులకు అందుబాటులో ఉండాలి

నంబులి పూలకుంట : రైతు భరోసాకేంద్రాల సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండి పంటసాగులో తగిన సలహాలు, సూచనలు అందించాలని వ్యవసాయ సలహామండలి జిల్లా అధ్యక్షులు అవుటాల రమణారెడ్డి సూచించారు. స్థానికరైతు భరోసా కేంద్రంలో మంగళవారం జరిగిన సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ రాబోయే కాలంలో ప్రతి రైతు భరోసా కేంద్రం వద్ద అన్ని రకాల మందులు అందుబాటులు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ రవినాయక్, ఎంపీడీవో ఆదినారాయణ, పశు వైద్యశాల డాక్టర్ ఆనంద్ నాయక్, వ్యవసాయ అధికారి లోకేష్ రెడ్డి, వ్యవసాయ సహాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

గాండ్లపెంట : వ్యవసాయ శాఖ అధికారులు, ఆర్‌బికె సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండాలని మండల అగ్రి అడ్వజర్ ఛైర్మన్ శంకరనాయుడు సూచించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశానికి జిల్లా అగ్రి అడ్వైజర్ చైర్మన్ రమణారెడ్డి హాజరయ్యారు. ప్రతి రైతుకు ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలు రైతులకు చేరవేసే బాధ్యత అధికారులదేనని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో లక్ష్మీ ప్రియ, ఎంపీపీ జగన్మోహన్, వైసీపీ మండల కన్వీనర్ పోరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, మాజీ జెడ్పిటీసీ భాస్కర్ రెడ్డి, ప్రతాప్ రెడ్డి, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ పుల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాయితీతో గడ్డికోత యంత్రాలు

బత్తలపల్లి : రైతులకు 40 శాతం రాయితీతో గడ్డి కోత యంత్రాలను పంపిణీ చేయనున్నట్లు పశువైద్యాధికారి గురునాథ్‌రెడ్డి, ఎవిహెచ్ ఎడి శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం వారు విలేకర్లతో మాట్లాడుతూ 40 శాతం. రాయితీతో గడ్డి కోత యంత్రాలు అందజేయనున్నట్లు తెలిపారు. కావాల్సిన రైతులు మూడు వారాల లోపు డీడీ అందజేయాలని సూచించారు.

17న పశువుల సంత

గోరంట్ల : పట్టణంలో మార్కెట్ యార్డ్‌లో ఈనెల 17న పశువుల సంత నిర్వహిస్తున్నట్లు మార్కెట్ యార్డ్ సిబ్బంది తెలిపారు. ముద్ద చర్మవ్యాధి తో పశువులు మృత్యువాత పడుతుండడంతో రెండు నెలల నుండి పశువుల సంతను జరపడం లేదన్నారు. జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు మేరకు ఈనెల 17న గురువారం స్థానిక మార్కెట్ యార్డులో యథాతథంగా పశువుల సంత నిర్వహిస్తున్నామని చెప్పారు.

పరిశుభ్రతపై అవగాహన

కదిరి టౌన్ : పరిసరాల పరిశుభ్రతపై మున్సిపల్, సచివాలయ సిబ్బంది విద్యార్థులకు అవగాహన కల్పించారు. పట్టణంలోని బెరిపల్లి వాల్మీకి స్కూల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులకు అవగాహన లక్పించారు. తడి చెత్త ఆకు పచ్చ రంగు బుట్ట, పొడి చెత్త ను నీలం రంగు బుట్ట ఏర్పాటుపై వివరించారు. సింగిల్ యూస్ ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగి నష్టాల గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వాల్మీకి స్కూల్ కరస్పాండెంట్ అనిల్ కుమార్ రెడ్డి, వార్డు పర్యావరణ పారిశుధ్య కార్యదర్శులు కుసుమ, లావణ్య, రామచంద్ర, శ్యామలా, చంద్ర నాయక్, వినోద్, మధుసూదన రెడ్డి, విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు .

22 నుంచి కళాత్మక పోటీలు

బుక్కపట్నం : ఈనెల 22వ తేదీ నుంచి న్యూఢిల్లీ వారి కళా ఉత్సవంలో భాగంగా సంగీతం, నృత్యం, చిత్రలేఖనం తదితర విభాగాల్లో పోటీలు జరుగుతాయని డైట్ కళాశాల ప్రిన్సిపల్ రామకృష్ణ తెలిపారు. 9వ తరగతి నుండి ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం వరకు 2022 23 విద్యా సంవత్సరం చెందిన ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ పాఠశాలలోని విద్యార్థిని విద్యార్థులు ఇందులో పాల్గొనడానికి అర్హులని చెప్పారు. ఈ పోటీలు అనంతపురం జిల్లా కేంద్రంతో పాటు, సత్య సాయి జిల్లాలోని ప్రభుత్వ డైట్ కళాశాల నందు జరుగుతాయని అన్నారు. అసక్తిగల విద్యార్థులు 19వ తేదీ లోపల తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు.

కుష్టు నిర్ధారణపై సర్వే

రొద్దం : మండలప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఎం జగదీష్ బాబు ఆధ్వర్యంలో కుష్టు వ్యాధి నిర్ధారణ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. మండలంలోని 15 సచివాలయాల్లో 814 గృహాలను సర్వే చేశారు. ఈ కార్యక్రమాన్ని మండలంలో 14 రోజులు పాటు నిర్వహిస్తున్నట్లు వైద్యులు తెలిపారు.

సచివాలయాల తనిఖీ

పుట్టపర్తి రూరల్: మండల పరిధిలోని పలు సచివాలయాలను డిఎల్‌డిఒ శివారెడ్డి, ఎంపీడీవో అశోక్ కుమార్ రెడ్డి మంగళవారం పరిశీలించారు. పెడపల్లి, కోట్లపల్లి, నిడిమామిడి ,సచివాలయాల్లో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. కార్యాలయంలోని రికార్డులను పరిశీలించారు. గ్రామ సచివాలయాలకు వచ్చే ప్రజలతో మర్యాదగాపూర్వకంగా వ్యవహరించి వారి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, సచివాలయాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మితిమీరిన వైసిపి ఆగడాలు : తెలుగుయువత



కావడి ప్రవీణ్‌కుమార్

తనకల్లు : రాష్ట్రంలో వైసిపి ఆగడాలు ఎక్కువయ్యాయని తెలుగుయువత మండల అధ్యక్షులు కావడి ప్రవీణ్‌కుమార్ విమర్శించారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. తెలుగుజాతి ఆత్మ గౌరవాన్ని ప్రపంచ నలుమూలల చాటిన ఎన్టీ రామారావు విగ్రహానికి చెప్పుల దండ వేసిఅవమానించడం చాలా దుర్మార్గమైన చర్య అని అన్నారు. ఈ చర్యను తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. జగన్మోహన్ రెడ్డి పరిపాలనలో రాష్ట్రం రావణ కాష్టంగా తయారయిందని విమర్శించారు. ఎక్కడ చూసినా వైసీపీ నాయకుల దౌర్జన్యాలు మితిమీరి పోయాయని ఆగ్రహం వ్యక్తం చేశారు.

పార్టీ బలోపేతానికి సమిష్టి కృషి : బికె



సమావేశంలో మాట్లాడుతున్న పార్థసారధి

పెనుకొండ : పార్టీ బలోపేతానికి కలసికట్టుగా కృషి చేద్దామని టిడిపి జిల్లా అధ్యక్షులు బికె. పార్థసారథి పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గంలోని సోమందేపల్లి, గోరంట్ల మండల కన్వీనర్లు, గ్రామ కమిటీ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీకి గ్రామ కమిటీలు మూలస్తంభాలని అన్నారు. వైసీపీ ప్రభుత్వం చేస్తున్న అరాచకాలను ప్రజలకు వివరిస్తూ దుర్మార్గపు ప్రభుత్వాన్ని సాగనంపాలని అన్నారు. ఈ సమావేశంలో పార్లమెంట్ అధికార ప్రతినిధి రొద్దం నరసింహులు, నియోజకవర్గం కమిటీ అధ్యక్షులు చిన్నప్పయ్య, మండల కన్వీనర్లు నరహరి, సోమశేఖర్, సిద్దలింగప్ప, సిద్దయ్య, ప్రధాన కార్యదర్శి అశ్వర్థరెడ్డి, మండలాలలోని అన్ని గ్రామాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

రొద్దం : గ్రూపు రాజకీయాలు వదిలి పార్టీ అభివృద్ధికి కలిసి కట్టుగా పనిచేయాలని టిడిపి జిల్లా అధ్యక్షులు బికె. పార్థసారథి నాయకులకు, కార్యకర్తలకు సూచించారు. మండలంలోని గ్రామ కమిటీ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులతో మంగళవారం సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో గ్రామ నాయకులు కలుపుకొని పోవాలి ఎప్పటికప్పుడు ప్రజల్లో చైతన్యం తీసుకురావాలన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకుపోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ అధికార ప్రతినిధి రొద్దం నరసింహులు, నియోజకవర్గం కమిటీ అధ్యక్షులు చిన్నప్పయ్య, మండల కన్వీనర్ నరహరి, ప్రధాన కార్యదర్శి మురళి, మండలంలోని ఆయా గ్రామాల పార్టీ అధ్యక్షులు ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

చదువులతోపాటు క్రీడల్లోనూ రాణించాలి



క్రీడా దుస్తులు అందజేస్తున్న నాయకులు

ప్రజా శక్తి బుక్కపట్నం

విద్యార్థులు చదువులతోపాటు క్రీడల్లో ఆసక్తి పెంచుకొని అత్యున్నత స్థాయికి చేరుకోవాలని టిడిపి జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడాకారులకు జెర్సీలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడలలో రాణించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని కోరారు. చదువులతో పాటు క్రీడల ముఖ్యమని తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ లక్ష్మయ్య డిగ్రీ కళాశాలలో టాయిలెట్లు సరిగా లేవని తెలపగా తానే తానే స్వయంగా టాయిలెట్లను మరమ్మతు చేయిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు సామకోటి ఈశ్వరయ్య, సయ్యద్ బాషా, వెంకట నాయుడు , వైస్ ప్రిన్సిపల్ రవికుమార్, అధ్యాపకులు ఆదినారాయణ, ఓబయ్య, దస్తగిరి చంద్రమోహన్ , వెంకటకృష్ణయ్య , సిబ్బంది పాల్గొన్నారు

సకాలంలో పిఎంశ్రీ నమోదు చేయాలి

ప్రజాశక్తి బత్తలపల్లి

ప్రధానమంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా (పిఎంశ్రీ) పథకానికి ప్రాథమికంగా ఎంపికైన పాఠశాలలు సకాలంలో నమోదు చేసుకోవాలని డిఇఒ మీనాక్షి తెలిపారు. మంగళవారం మండలంలోని అప్పరాచెరువు ప్రాథమికోన్నత పాఠశాలను ఆమె పరిశీలించారు. రికార్డులను పరిశీలించి మధ్యాహ్న భోజనం పథకం అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులతో పాటు సిఆర్‌పి వెంకటరమణ, సిబ్బంది పాల్గొన్నారు.

అదనపు గృహాల మంజూరుకు వినతి



నాయకులు, అధికారులతో మాట్లాడుతున్న మంత్రి

చిలమత్తూరు : మండలంలో అదనంగా మరో 500 గృహాలు మంజూరు చేయాలని ఎంపిపి పురుషోత్తమ రెడ్డి, పీడీ నాగరాజు గృహ నిర్మాణ శాఖ మంత్రికి జోగి రమేష్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. మంత్రి అనంతపురం పర్యటనకు వస్తున్న సందర్భంగా బాగేపల్లి టోల్ గేట్ వద్ద వినతి పత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఈఈ నాగరాజు, డీఈ శివకుమార్, ఏఈ రాజేంద్రప్రసాద్, సర్పంచి ఈడిగ తిరుమలేష్, మురళి తదితరులు పాల్గొన్నారు.

ఆటల పోటీల్లో 'పాంచజన్య' విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-హిందూపురం

బాలల దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని రోటరీ క్లబ్ నిర్వహించిన పోటీల్లో పాంచజన్య బ్రిలియంట్స్ పాఠశాల విద్యార్థులు అన్ని విభాగాల్లోనూ ప్రతిభ చాటినట్లు పాఠశాల అధ్యక్షులు పాంచజన్య శ్రీనివాసులు తెలిపారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ఆయన మంగళవారం అభినందించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతు బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని రోటరీ క్లబ్ 9 రకాల పోటీలను నిర్వహించిందన్నారు. అన్ని విభాగాల్లోను తమ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చినారన్నారు. సజనాత్మకతలో మన్విత్ ప్రథమ స్థానం, ఎస్. సౌధ్ తృతీయ స్థానం, వ్యాసరచన పోటీల్లో హెచ్. షాజియా ప్రథమ స్థానం, సంగీతంలో హీనా, గౌసియా, ఫ్యాషన్ వాక్‌లో బందన ప్రథమ స్థానం, అయాన్ తృతీయ స్థానంలో నిలిచారన్నారు. స్టాండ్ అప్ కామెడీలో లక్ష్మీ నారాయణ ప్రథమ స్థానం, నృత్య పోటీల్లో అభిగ్న గ్రూపు ప్రథమ స్థానం, స్కిట్ హెచ్. బృందా బృందం ద్వితీయ స్థానంలో నిలిచిందన్నారు. డ్రాయింగ్‌లో ప్రనూష ద్వితీయ స్థానం, ఫ్యాన్సీ డ్రెస్ పోటీల్లో భువిక తృతీయ స్థానం సాధించారన్నారు. వీరితో పాటు మరి కొంత మంది విద్యార్థులు కన్సోలేషన్ ప్రైజులు సాధించారన్నారు. ఇంతటి విజయం సాధించడానికి విద్యార్థుల పట్టుదల, వారి తల్లిదండ్రుల సహకారం, ఉపాధ్యాయుల శ్రమే కారణమన్నారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ నందకుమార్ ఆకాడమిక్ డైరెక్టర్ స్మిత, అడ్మినిస్ట్రేటీవ్ డైరెక్టర్ నందిత, ఎఒ భాస్కర్, హెచ్‌ఎం గాయిత్రి, ఎహెచ్‌ఎంలు విజయేంద్ర, శశికళ, సుగుణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ప్రతిభా విద్యార్థులతో పాంచజన్య శ్రీనివాసులు

గ్రంథాలయాలు విజ్ఞాన నిధులు

పెనుకొండ : పట్టణంలోని పి.ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గ్రంథాలయ వారోత్సవాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు.ఈ సమావేశానికి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నీలం. రమేష్ రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతు పుస్తక పఠనం సామాన్య వ్యక్తులను కూడా మహోన్నతమైన వ్యక్తులుగా తీర్చిదిద్దగలదని అన్నారు. సాహితీ స్రవంతి కన్వీనర్ హరి మాట్లాడుతూ విద్యార్థులు రోజుకు కనీసం ఒక గంటయినా పుస్తకం చదివే అలవాటు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ జయప్ప, గ్రంథాలయ అధికారి శ్రీనివాసులు, అధ్యాపకులు చెన్నారెడ్డి, ప్రతాప్ , ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

కొత్తచెరువు : గ్రంథాలయాలు విజ్ఞాన బాండాగారాలని గ్రంథాలయ అధికారి కె జయరాం తెలిపారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం శాఖ గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు వాల్మీకి శంకర్, ఉద్యోగులు మహమ్మద్, వెంకటరమణప్ప, వెంకటప్ప, అటెండర్ మునీరు, పాఠకులు పాల్గొన్నారు,

తనకల్లు : జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా మంగళవారం స్థానిక గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి మస్తాన్ వలి, ఉర్దూ పాఠశాల హెచ్‌ఎం గౌస్‌అహ్మద్, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

తాడిమర్రి : జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా రెండో రోజు మంగళవారం శాఖ గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి డి.శీనా నాయక్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చిలమత్తూరు : జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా స్థానిక గ్రంథాలయంలో మంగళవారం పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి మల్లికార్జున, ఉపాధ్యాయులు శ్రీనివాసులు, అమీర్‌బాషా, విద్యార్థులు, ఉపాధ్యాయులు, పాఠకులు పాల్గొన్నారు.

లేపాక్షి : గ్రంథాలయవారోత్సవాల్లో భాంగా మంగళవారం పుస్తక ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ శ్రీనివాసులు, జయసింహా రాజు, గంగరాజు, క్రిష్టప్ప, విద్యార్థులు పాల్గొన్నారు.

చెరువులో పడి మహిళ మృతి

అమరాపురం : అమరాపురం చెరువులో మహిళ పడి మృతిచెందిన సంఘటన మంగళవారం చోటు చేసుకొంది. ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాలు.. మండల పరిధిలోని నాగనపల్లికి చెందిన మల్లేశప్ప భార్య రత్నమ్మ(42) భర్తతో గొడవ పడి ఎస్సీ కాలనీలో ఉన్న తన తల్లిదగ్గ ఉంటోంది. ప్రస్తుతం ఈమెకు అనారోగ్యంతో బాధపడుతోంది. మూర్ఛవ్యాధి తోడు కడుపు నొప్పితో బాధపడుతున్న రత్నమ్మ జీవితంపై విరక్తి చెంది చెరువులో పడి మృతిచెందింది. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సిఐ మధుపై కోర్టులో ప్రయివేటు కేసు

కదిరి టౌన్ : కదిరి పట్టణ సిఐ మధుతో పాటు మరో ముగ్గురిపై కోర్టులో ప్రయివేటు కేసు వేసినట్లు మాజీ మహిళా కమిషన్ సభ్యురాలు పర్వీన్ భాను, కదిరి పట్టణానికి చెందిన ఉమా తెలిపారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ ఈ ఏడాది సెప్టెంబర్ 7వ తేదీన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా కదిరి ఎమ్మెల్యే సిద్దారెడ్డి కదిరి పట్టణం మూడో వార్డు సైదాపురంలో పర్యటించారన్నారు. ఈసందర్భంగా స్థానికంగా నెలకొన్న సమస్యలను విన్నవించేందుకు వెళ్లగా పట్టణ సిఐతోపాటు ఎమ్మెల్యే గన్‌మెన్లు ఇద్దరు అడ్డుకున్నారన్నారు. అంతేకాకుండా దురుసుగాను దుర్భాషలాడారని విమర్శించారు. వీటన్నిటిపై ఫిర్యాదు చేసేందుకు వెళ్లగా కేసు నమోదు చేయకుండా కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. వీటన్నిటిపై కదిరి ఎజెఎఫ్‌సిఎం కోర్టులో అడ్వకేట్ ద్వారా ప్రయివేటు కేసు వేశామన్నారు. ఫిర్యాదును స్వీకరించిన కోర్టు విచారణకు ఆదేశించిందన్నారు.

గుండెపోటుతో ప్రయాణికుడు మృతి

హిందూపురం : పట్టణంలోని పరిగి బస్టాండులో గుండె పోటుతో ప్రయాణికుడు మృతిచెందాడు. కర్నాటక రాష్ట్రం తిరుపూరుకు చెందిన శంకర్ తన కుమారుడితో కలిసి హిందూపురం పరిగి బస్టాండ్‌కు వచ్చారు. బస్టాండ్‌లో నీరు తాగి కూర్చొన్నాడు. ఈ సమయంలో ఉన్న ఫళంగా శంకర్ గుండె పోటుకు గురై కుప్పకూలిపోయాడు. వెంటనే స్థానికులతో కలిసి మృతుని కుమారుడు అంబులెన్స్ సాయంతో శంకర్‌ను ప్రభుత్వ అసుపత్రికి తీసుకెళ్లారు. పరీక్షలు నిర్వహించిన వైద్యులు శంకర్ (58) అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు.

పవన్ కళ్యాణ్ దిష్టిబొమ్మ దహనం

గోరంట్ల : మండలంలోని ఉగ్రరంపల్లి గ్రామ సమీపాన జగనన్న లేఅవుట్‌లో స్థానిక వైసిపి నాయకులు జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ దిష్టిబొమ్మను మంగళవారం దహనం చేశారు. ఈ సందర్భంగా వైసీపీ నాయకులు మాట్లాడుతూ జగనన్న కాలనీలలో లబ్ధిదారులకు నివాస గృహాలు మంజూరు చేయలేదని జనసేన పార్టీ నాయకులు రెండు రోజుల క్రితం ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పై విమర్శలు చేశారన్నారు. దీనిపై వ్యతిరేకంగా పవన్ కళ్యాణ్ దిష్టిబొమ్మను దహనం చేశామన్నారు. పవన్‌కళ్యాణ్ ప్యాకేజీ తో రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. జనసేన పార్టీ నాయకులు ప్రభుత్వంపై అసత్య ఆరోపణలు చేయడం మానుకోవాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో సర్పంచి శ్రీరాములు, ఉప సర్పంచి బుల్లెట్‌బాబు, ఎంపీటీసీ హరి, మేదర శంకర, శ్రీనివాసులు, సహకార సంఘం అధ్యక్షులు రాజేంద్రప్రసాద్, ఈశ్వరయ్య, రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

విదేశీ మహిళల ఆర్థికచేయూత

పుట్టపర్తి రూరల్ : విదేశీ మహిళల ఆర్థిక సాయంతో గ్రామీణ ప్రాంతంలో పేద మహిళలకు పిఆర్‌డిఎస్ ఆధ్వర్యంలో చేయూత నందించారు. మండల పరిధిలోని బత్తలపల్లి గ్రామంలో పదిమంది మహిళా పాడి రైతులను గుర్తించి వారికి పాడిఆవులను కొనుగోలు చేసి వాటిని మంగళవారం అందజేశారు. ఇదివరకు మండల వ్యాప్తంగా తొమ్మిది నెలల కాలంలో80 ఆవులు కొనుగోలుచేసి మహిళలకు అందించినట్లు పిఆర్‌డిఎస్ సెక్రటరీ ఆర్ ప్రభాకర్ రెడ్డి తెలిపారు. మహిళలకు వడ్డీ లేని రుణాలను అందించి వారి కుటుంబ పోషణ కొరకు, ప్రతిరోజు రూ. 300 నుండి 500 రూపాయల వరకు సంపాదించే విధంగా ఉపాధి కల్పించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో విదేశీ మహిళలు యాంజేలా డిక్సన్ శ్యామ్ డిక్‌సన్, పిఆర్‌డిఎస్ సిబ్బంది ప్రభాకర్ రెడ్డి, గోపాలమిత్ర వైకుంఠవాసులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు

కార్మికుల సమస్యలు పరిష్కరించండి : సిఐటియు

తలుపుల : మండలంలోని ఆయా గ్రామ పంచాయతీల స్వచ్ఛభారత్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సిఐటియు జిల్లా కోశాధికారి బత్తల సాంబశివ డిమాండ్ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలన్నారు. 6నెలల వేతనాలు చెల్లించాలని జిల్లా అధికారులు చెబిగే కేవలం మూడు నెలలు ఇస్తున్నారన్నాని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని లేనిపక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు రామక్రిష్ణ, కార్మికులు మహబూబ్‌బాషా, మహేష్, అరుణమ్మ, వెంకటేశమ్మ, అశోక్, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

హిందూపురం : పురపాలక సంఘ వ్యాప్తంగా ప్రజారోగ్యానికి భంగం కలిగించే విధంగా ప్రవర్తిస్తే వారిపై పురపాలక సంఘ చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ డాక్టర్ వెంకటేశ్వరరావు హెచ్చరించారు. మంగళవారం పురపాలక సంఘ పరిధిలోని పరిగి రోడ్డులో అనధికారికంగా నిర్వహిస్తున్న కబేళాలపై మున్సిపల్ అధికారులు దాడులు నిర్వహించారు. పశువులను వధించి, వాటి వ్యర్థాలను అక్కడే వేయడాన్ని గమనించిన కమిషనర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వధించడానికి సిద్ధంగా ఉంచిన పశువులను పరిశీలించారు. అనుమతులు లేకుండా కబేళాల నిర్వహణ కోసం నిర్మాణం చేసుకున్న షెడ్లను జెసిబి సాయంతో తొలగింపజేశారు. ఈ కార్యక్రమంలో ఎసిపి ఆనంద్‌కుమార్, ఎఎస్ఐ సిబ్బంది, విద్యుత్ శాఖ ఎఇ లక్ష్మీకాంత్, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించండి

ఓబుల దేవర చెరువు : మండలకేంద్రంలోని పలు కాలనీలలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని టిడిపి నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయా కాలనీవాసులతో కలసి మంగళవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. స్థానికచెరువు మరువ దగ్గర ,మర్రిమాను చెట్టు దగ్గర ,ఉర్దూ పాఠశాల వద్ద తాగునీటి సమస్య నెలకొందన్నారు. బోరు మోటర్ చెడిపోయి 17 రోజులు కావస్తున్న పట్టించుకునే నాథుడు లేడని విమర్శించారు. ఈ కార్యక్రమంలో పార్టీ కన్వీనర్ జయచంద్ర, మైనార్టీ అధ్యక్షుడు షాను, గ్రామ కమిటీ అధ్యక్షుడు సౌదీ నాగరాజు, ప్రధాన కార్యదర్శి పీట్ల సుధాకర్, పుట్టపర్తి మైనార్టీ నాయకుడు షబ్బీర్ , చాంద్‌బాషా, కాలనీవాసులు శివమ్మ అక్కులమ్మ, మునెమ్మ, సాలెమ్మ తదితరులు పాల్గొన్నారు.



ఆసుపత్రి వద్ద అధికారులు

ఆసుపత్రిని తనిఖీ చేసిన అధికారులు

ప్రజాశక్తి వార్తకు స్పందన

లేపాక్షి : మండల కేంద్రంలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా అధికారులు మంగళవారం తనిఖీ చేశారు. డిప్యూటీ డిఎం హెచ్ఒ మంజువాణి తదితరులు తనిఖీలు నిర్వహించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంపై ప్రజాశక్తి దిన పత్రికలో రెండు రోజులుగా కథనాలు వచ్చిన నేపథ్యంలో జిల్లా అధికారులు స్పందించారు. వైద్యులు, సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలనిమెరుగైన వైద్యం అందించాలని డాక్టర్ చిరంజీవికి ఆమె సూచించారు. డిస్పోజల్‌కు నోచుకోని బయో మెడికల్ వ్యర్థాల గురించి ఆరా తీశారు. వెంటనే వాటిని గ్రామానికి దూరంగా తీసుకెళ్ళి కాల్చివేయాలని ఆదేశించారు. మరోసారి ఇలా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో బయో మెడికల్ వ్యర్థాలు వేసినట్లు తమ దృష్టికి వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈసందర్భంగా డిప్యూటీ డిఎంహెచ్ఒ ప్రజాశక్తితో మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆసుపత్రిని తనిఖీ చేశామని ఇక్కడ తమ దృష్టికి వచ్చిన వాటిని ఉన్నతాధికారులకు నివేదిస్తామని చెప్పారు.

సూపర్‌స్టార్ కృష్ణ మృతికి నివాళి

ధర్మవరం టౌన్ : సూపర్‌స్టార్ కృష్ణ మృతి సినీరంగానికే తీరనిలోటని, సినీరంగంలో ఓ నక్షత్రం రాలిపోయిందని కృష్ణ, మహేశ్ ప్యాన్ అసోషియేషన్ పట్టణ అధ్యక్షుడు మేడాపురం వెంకటేశ్ అన్నారు. కృష్ణ మృతికి సంతాపకంగా స్థానికకాలేజ్ సర్కిల్లో పొట్టిశ్రీరాముల విగ్రహం ఎదుట కృష్ణ ఫ్లెక్సిని ఏర్పాటుచేసి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో అభిమానులు బాస్కర్, గోవిందు, రామక్రిష్ణ, జిలాన్ బాషా, వెంకటరాముడు, జంగాలపల్లిపెద్దన్న, మహేశ్, రమణ, ఓబులేశు తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం : సినీ నటులు కృష్ణ మృతికి కళాకారుల ఐక్య వేదిక, ఆధ్వర్యంలో ఘనంగా నివాళులు అర్పించారు. మంగళవారం అంబేద్కర్ సర్కిల్‌లో కృష్ణ చిత్ర పటానికి పూల మాలలు వేసి సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాకారుల ఐక్యవేదిక అధ్యక్షుడు బి. అంజప్ప, కార్యదర్శి శివకుమార్, గౌరవ సలహాదారులు మార్గదర్శి మాళప్ప, అభిమానులు మార్కెట్ యార్డ్ మాజీ ఛైర్మన్ కొండూరు మల్లికార్జున, ప్రభాకర్ రెడ్డి, దాదు, రమణ, కె కె శ్రీధర్, రాజు, రమ, కిరోసిన్ బాబు, శేఖర్, షాకీర్, కుమార్, కళాకారుల ఐక్యవేదిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



కృష్ణ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న దృశ్యం